క్లుప్తంగా

కాణిపాకం బోర్డు సభ్యుడికి సన్మానం



నరసింహులుశెట్టిని సన్మానిస్తున్న సంఘ సభ్యులు

చిత్తూరు రూరల్: కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయ ట్రస్టు బోర్డు సభ్యుడిగా నియమితులైన మువ్వల నరసింహులు శెట్టిని గురువారం ఆర్యవైశ్య సంఘ సభ్యులు ఘనంగా సన్మానించారు. చిత్తూరు నగరంలోని వాసవీ కన్యాకపరమేశ్వరి ఆలయంలో గురువారం అర్బన్ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు చల్లారు ద్వారకనాథ్ ఆధ్వర్యంలో ఆయనకు సన్మాన సభ నిర్వహించారు. వరుసగా మూడు సార్లు ట్రస్టు బోర్డు సభ్యుడిగా నరసింహులను నియమించడం అభినందనీయమని, ఇందుకు రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు వెంకటేష్, రవీంద్రబాబు, చంద్రశేఖర్, శైలరావు, భాస్కర్, సత్యనారాయణ, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

రేపు ప్రజావేదిక

పూతలపట్టు: ఉపాధి హామీ పథకం కింద 2022–23లో చేపట్టిన పనులపై శనివారం మధ్యాహ్నం 2 గంటలకు స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో సామాజిక తనిఖీపై ప్రజావేదిక నిర్వహించనున్నట్టు ఎంపీడీవో గౌరి తెలిపారు. మండలంలోని 24 పంచాయతీల్లో 10 రోజులుగా సామాజిక తనిఖీ చేపట్టినట్టు తెలిపారు. ఈ సందర్భంగా అధికారులు గుర్తించిన అంశాలపై ప్రజా వేదికలో చర్చించనున్నట్టు పేర్కొన్నారు.

రైతుల పంటలకు భరోసా



ఈక్రాప్ బుకింగ్ వివరాలను ప్రదర్శిస్తున్న రైతులు, సిబ్బంది

చిత్తూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం రైతు కష్టాన్ని గుర్తించి పంటలకు పక్కాగా భరోసా కల్పిస్తోందని ఎంపీటీసీ ప్రతిమారెడ్డి తెలిపారు. చిత్తూరు మండలం చెర్లోపల్లిలో గురువారం ఈ క్రాప్ బుకింగ్‌పై గ్రామసభ నిర్వహించారు. సచివాలయ పరిధిలో పండించిన పంటల వివరాల నమోదును ప్రదర్శించారు. అగ్రికల్చర్ అసిస్టెంట్ ప్రియ ఈ క్రాప్ బుకింగ్‌పై రైతులకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ పంట నమోదుతో రైతులకు మేలు జరుగుతుందన్నారు. రైతు భరోసా కేంద్రం ద్వారా అందించే సేవలను సద్వినియోగం చేసుకొని వ్యవసాయాన్ని వృద్ధి చేసుకోవాలన్నారు. అనంతరం రైతుకు సంబంధించిన బుక్‌లెట్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శివ రాజ్, రైతులు పాల్గొన్నారు.

భగవద్గీత పఠన పోటీలు

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరంలోని చిన్మయ యోగాశ్రమంలో గురువారం భగవద్గీత పఠన పోటీలు నిర్వహించారు. ఇందులో మండలంలోని 12 పాఠశాలలకు చెందిన 400 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. వారిని రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీలకు పంపుతామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో సత్య, శివకుమార్, అశోక్, కేశవరెడ్డి, తాండవమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటా సర్వే చేయాలి



గుడిపాల: విలేజ్ హెల్త్ క్లినిక్‌ను పరిశీలిస్తున్న గుణశేఖర్

గుడిపాల: వైద్య, ఆరోగ్య సేవలపై ప్రతి ఇంటా సర్వే చేయాలని జిల్లా హెల్త్ అండ్ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ గుణశేఖర్, వైద్య ఆరోగ్య శాఖ స్టాటిస్టికల్ అధికారి జార్జ్ ఆదేశించారు. వారు గురువారం గుడిపాల మండలం 189 కొత్తపల్లె, వసంతాపురం సచివాలయాల్లో విలేజ్ క్లినిక్‌లను తనిఖీ చేశారు. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే టీమ్ సర్వేను పరిశీలించారు. వారు మాట్లాడుతూ ప్రతి ఇంటికీ వెళ్లి స్థానికులతో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకోవాలన్నారు. వారు వైద్య సేవలను ఎంత వరకు వినియోగించుకుంటున్నారు, ప్రైవేట్‌లో ఎంతవరకు వైద్య సేవలు అందుతున్నాయి అన్న విషయాలను గుర్తించాలని సూచించారు. గర్భిణులు తల్లీ బిడ్డ ఎక్స్‌ప్రెస్ పొందుతున్నారా లేదా అని ఆరా తీశారు.

నేడు బంగారుపాళెంలో 'జగనన్నకు చెబుదాం'

బంగారుపాళెం: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశ మందిరంలో శుక్రవారం జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు ఇన్‌చార్జి ఎంపీడీవో హరిప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభం కానున్న కార్యక్రమానికి జిల్లా, మండల స్థాయి అధికారులు హాజరవుతారని, ప్రజలు తమ సమస్యలను వారి దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని కోరారు.



ఐరాల: సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు



బంగారుపాళెం: సమావేశంలో పాల్గొన్న సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు

వైఎస్సార్‌సీపీ విజయానికి సైనికుల్లా పనిచేద్దాం

ఐరాల/బంగారుపాళెం : వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి సైనికుల్లా పనిచేద్దామని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు పిలుపునిచ్చారు. ఆయన గురువారం ఐరాలలోని షాదీమహల్‌లో వైఎస్సార్ సీపీ మండల సచివాలయ కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో, అలాగే బంగారుపాళెంలోని అరగొండ రోడ్డులో ఉన్న ఎస్ఎల్‌వీ కల్యాణ మండపంలో ఎంపీపీ అమరావతి అధ్యక్షతన సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లతో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంపై శిక్షణ ఇచ్చారు. ఆయా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ 2024లో తిరిగి జగనన్నను ముఖ్యమంత్రిగా గెలిపించడానికి సమష్టిగా పనిచేయాలన్నారు. ఏపీకి జగనే ఎందుకు కావాలి కార్యక్రమంలో గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, వలంటీర్లు భాగస్వాములు కావాలన్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించాలన్నారు. గత టీడీపీ, ప్రస్తుత జగనన్న ప్రభుత్వంపై ప్రజలు ఎంతమేర సంతృప్తి చెందారో తెలుసుకోవాలన్నారు. ఆయా గ్రామాల్లో తప్పనిసరిగా పార్టీ జెండాను ఆవిష్కరించాలన్నారు. ఆ రాత్రికి గ్రామంలో బసచేసి సంక్షేమ పథకాలపై ప్రజలతో చర్చించి ప్రభుత్వ పనితీరు వివరించాలన్నారు. ఎన్నికలు సమీపిస్తున్నాయని, ప్రతి ఒక్కరూ పార్టీ విజయానికి కృషి చేయాలన్నారు. ఐరాలలో జరిగిన కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీపీ మోహన్, కాణిపాకం ఆలయ చైర్మన్ మోహన్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ చంద్రరెడ్డి, మండల యువత అధ్యక్షుడు భార్గవ్‌రెడ్డి, బంగారుపాళెంలో జరిగిన కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు శిరీష్‌రెడ్డి, జయకుమార్, జెడ్పీటీసీ సోమశేఖర్, సింగిల్‌విండో, మార్కెట్ కమిటీ చైర్మన్లు దత్తాత్రేయరెడ్డి, నారే సోమశేఖర్, ఉపాధ్యక్షుడు సర్దార్, రైతు విభాగం కార్యదర్శి ప్రవీణ్‌రెడ్డి, వడ్డెర, కురబ, ఈడిగ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్లు మొగిలీశ్వర్, అమరనాథ్, యల్లప్ప, జిల్లా సేవాదళ్ల అధ్యక్షుడు కిషోర్‌కుమార్‌రెడ్డి, పార్టీ కార్యదర్శులు ప్రకాష్‌రెడ్డి, కృష్ణమూర్తి, చందు, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు సుబ్రమణ్యం, కోఆప్షన్ సభ్యుడు ఫిరోజ్‌అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రసవ సేవల్లో నిర్లక్ష్యం వద్దు



సమీక్షలో మాట్లాడుతున్న డీఐవో రవిరాజు

చిత్తూరు రూరల్: ప్రసవ సేవల్లో నిర్లక్ష్యం వహించవద్దని ఏఎస్ఎంలు, ఆశా వర్కర్లు, మండల వైద్యాధికారులను డీఐవో రవిరాజు హెచ్చరించారు. ఆయన గురువారం చిత్తూరు నగరంలోని డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయంలో మాతా శిశు మరణాలపై సమీక్షించారు. రెండు మాతృ మరణాలు, 11 శిశు మరణాలపై విచారించారు. ఆయన మాట్లాడుతూ గర్భవతి అని తెలిసిన వెంటనే క్షేత్రస్థాయిలోని వైద్య సిబ్బంది స్పందించాలన్నారు. తరచూ వైద్య పరీక్షలు చేయాలని, మెరుగైన వైద్యం అందేలా చూడాలన్నారు. హైరిస్క్ కేసులను నిత్యం పర్యవేక్షిస్తుండాలని పేర్కొన్నారు. వారిని సకాలంలో ప్రసవానికి ఆస్పత్రికి తరలించే బాధ్యత వైద్య సిబ్బంది దేనని స్పష్టం చేశారు. రక్తహీనత లోపం నివారణకు ప్రభుత్వం తీసుకుంటున్న సేవలపై గర్భిణుల అవగాహన కల్పించాలని ఆదేశించారు. వైద్యులు ఉషశ్రీ, మీనాకుమారి, కీర్తిసాగరి, మునిమోహన్ తదితరులు పాల్గొన్నారు.

అయోడిన్ ఉప్పు వాడాలి

యాదమరి : అయోడిన్ కలిగిన ఉప్పును వాడడం ఆరోగ్యానికి మంచిదని సంతగేటు వైద్యులు అనిల్‌కుమార్ నాయక్ తెలిపారు. మండలంలోని బుడితరెడ్డిపల్లెలోని పీహెచ్‌సీలో గురువారం గ్రామీణులకు అయోడిన్ ఉప్పుపై అవగాహన కల్పించారు. అయోడిన్ కలిగిన ఉప్పు వాడడం వల్ల కలిగే లాభాలు, వాడకపోతే వచ్చే ఆరోగ్య సమస్యలను వివరించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో లక్ష్మినారాయణ, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం సీజ్
– నిందితుడి అరెస్టు



నిందితుడి అరెస్టు చూపుతున్న ఎస్ఈబీ పోలీసులు

చిత్తూరు అర్బన్: కర్ణాటక నుంచి మద్యం తీసుకు వస్తున్న నరేష్‌రెడ్డి (41) అనే వ్యక్తిని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ), చిత్తూరు రూరల్ పోలీసులు గురువారం అరెస్టు చేశారు. ఎస్ఈబీ సీఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పోలీసులు బంగారుపాళ్యం మండలం వద్ద తనిఖీలు చేపట్టారు. కూర్మాయిపల్లె గ్రామం వద్ద బంగారుపాళ్యం మండలం రొల్లావారిపల్లెకు చెందిన ఆర్.నరేష్‌రెడ్డి అనుమానాస్పదంగా తిరుగుతుండగా పట్టుకున్నారు. విచారణలో అతను ఒక గదిలో కర్ణాటక మద్యాన్ని నిల్వ ఉంచినట్టు తెలిపాడు. పోలీసులు ఐదు బాక్సుల్లో ఉన్న మద్యాన్ని స్వాధీనం చేసుకుని నరేష్‌రెడ్డిని అరెస్టు చేశారు. కోర్టులో ప్రవేశపెట్టి చిత్తూరు జిల్లా జైలుకు తరలించారు. దాడుల్లో ఎస్ఐ మోహన్‌బాబు, సిబ్బంది క్రిష్టయ్య, సుబ్రమణ్యం గౌడ్, వెంకటేష్, కిరణ్‌కుమార్, మమత, గాయత్రి, చంద్రకళ పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు

చిత్తూరు అర్బన్: పోలీసు అమర వీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా గురువారం చిత్తూరు జిల్లాలోని పోలీస్ స్టేషన్లలో పాఠశాల విద్యార్థులకు లైగింక వేధింపులు, పిల్లల రక్షణ, సోషల్ మీడియా దుర్వినియోగం, సైబర్ నేరాలు అరికట్టడంలో సాంకేతికత పాత్ర అనే అంశాలపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఇందులో ప్రతిభ కనబరిచిన వారికి ప్రథమ బహుమతి కింద రూ. 5 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.3 వేలు, తృతీయ బహుమతిగా రూ.2 వేలు అందించనున్నట్లు అధికారులు పేర్కొన్నారు.



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

రాయితీపై విత్తనాల సరఫరా

చిత్తూరు అగ్రికల్చర్: ఈ రబీ సీజనులో సాగు చేసేందుకు ప్రభుత్వం రాయితీపై విత్తనాలను అందజేస్తున్నట్లు జిల్లా వ్యవసాయశాఖ అధికారి మురళీకృష్ణ తెలిపారు. ఇందుకోసం 69 క్వింటాళ్ల విత్తనాలను మంజూరు చేసినట్లు తెలిపారు. అందులో మినుములు 34 క్వింటాళ్లు, పెసలు 20 క్వింటాళ్లు, నువ్వులు 15 క్వింటాళ్లు కేటాయించినట్లు చెప్పారు. విత్తనాల కోసం రైతులు ఆయా గ్రామాల పరిధిలోని రైతు భరోసా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

28న టీటీడీ స్థానిక ఆలయాల మూత

తిరుపతి కల్చరల్: పాక్షిక చంద్ర గ్రహణం కారణంగా ఈనెల 28వ తేదీ శనివారం సాయంత్రం టీటీడీ స్థానిక ఆలయాల తలుపులు మూసివేస్తారు. తిరిగి మరుసటి రోజైన ఆదివారం ఉదయం ఆలయాల తలుపులు తెరుస్తారు. ఈ నెల 29న వేకువజామున 1.05 నుంచి 2.22 గంటల వరకు పాక్షిక చంద్ర గ్రహణం ఉంటుంది. గ్రహణ సమయానికి 6 గంటల ముందుగా ఆలయం తలుపులు మూసివేయడం ఆనవాయితీ. ఇందులో భాగంగా తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి ఆలయం, తిరుపతిలోని శ్రీగోవిందరాజస్వామి ఆలయం, శ్రీకోదండరామ స్వామివారి ఆలయం, శ్రీనివాస మంగాపురంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి వారి ఆలయాల్లో 28న రాత్రి 7 గంటలకు ఆలయ తలుపులు మూసివేస్తారు. తిరిగి 29న తెల్లవారుజామున 4.30 గంటలకు ఆలయ తలుపులు తెరుస్తారు.

కపిలేశ్వరస్వామి ఆలయంలో అన్నాభిషేకం

శ్రీకపిలేశ్వరస్వామి వారి ఆలయంలో ఈనెల 28న అన్నాభిషేకం జరుగనుంది. భక్తులకు అన్నలింగ ఉద్వాసన చేపట్టిన అన్నప్రసాదాన్ని భక్తులకు పంపిణీ చేస్తారు. శుద్ధి అనంతరం సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు సుగంధ ద్రవ్య అభిషేకం ఏకాంతంగా నిర్వహిస్తారు. 28న సాయంత్రం 6.45 గంటలకు ఆలయ తలుపులు మూసి వేసి 29వ తేదీన ఉదయం 4 గంటలకు ఆలయ తలుపులు తెరిచి శుద్ధి అనంతరం భక్తులకు సర్వదర్శనం కల్పిస్తారు.

నేటి నుంచి ఆయుర్వేద సదస్సు

తిరుపతి కల్చరల్: అఖిల భారత ఆయుర్వేద మహాసమ్మేళనం, భారత ప్రభుత్వ ఆయుష్ మంత్రిత్వ శాఖ సంయుక్తంగా, టీటీడీ ఎస్వీ ఆయుర్వేద కళాశాల ఆధ్వర్యంలో శుక్ర, శని, ఆదివారం మూడు రోజులపాటు ఆయుర్వేద పర్వం పేరుతో ఆయుర్వేద సదస్సులు, ప్రదర్శన కార్యక్రమాలు చేపడుతున్నట్లు పద్మశ్రీ పురస్కార గ్రహీత ఆలిండియా ఆయుర్వేదిక్ కాంగ్రెస్ ట్రస్ట్ అధ్యక్షుడు వైద్య దేవేందర్ త్రిగుణ తెలిపారు. ఆయుర్వేదం, యోగ, నేచురోపతి, యునాని, సిద్ధ, హోమియోపతి, సోవారిగ్పా వంటి వైద్య విధానాల ప్రాశస్త్యాన్ని, ప్రభావాన్ని సామాన్య ప్రజానీకానికి చేరువ చేయాలని తుడా కార్యాలయంలో వెనుకనున్న కచ్ఛపి ఆడిటోరియంలో ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. మూడు రోజులపాటు జరిగే ఈ ఆయుర్వేద పర్వం కార్యక్రమంలో ప్రతి రోజు ప్రముఖ ఆయుర్వేద వైద్యులు ఆయుర్వేద వైద్య విధానం, వినియోగం ద్వారా కలిగే ప్రయోజనాలు వంటి అంశాలపై ప్రసంగిస్తారని తెలిపారు. టీటీడీ ఎస్వీ ఆయుర్వేద కళాశాల ప్రిన్సిపాల్, మెడికల్ సూపరింటెంట్ డాక్టర్ రేణు దీక్షిత్, కేంద్ర ప్రభుత్వ సలహాదారుడు మనోజ్, ఆయుర్వేదపర్వం చీఫ్ కో ఆర్డినేటర్ డాక్టర్ వీవీ ప్రసాద్, డాక్టర్ ఎ.శంకరబాబు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైద్య దేవేందర్ త్రిగుణ

విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలి





పాఠశాలలో రికార్డులను పరిశీలిస్తున్న ఎంఈవోలు, మధ్యాహ్న భోజనాన్ని రుచిచూస్తున్న ఎంఈవో రామ్‌నాయక్

గుడిపాల: ప్రతి విద్యార్థికీ మెరుగైన విద్య అందించాలని ఎంఈవోలు రామ్‌నాయక్, గణపతి తెలిపారు. వారు గురువారం పల్లూరు ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. పాఠశాల ప్రగతి, జగనన్న విద్యా కానుక, రికార్డులను పరిశీలించారు. పాఠశాలల్లో లోటుపాట్లపై అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెడుతున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం వసంతాపురం ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ప్రభుత్వ మెనూను కచ్చితంగా అమలుచేయాలని, లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఉపాధ్యాయులు విద్యార్థులతో కలిసి భోజనం తినాలన్నారు. ఉపాధ్యాయులు శ్యామల, దుర్గా, లోకనాథం, సీఆర్‌పీలు వాణిశ్రీ, మల్లికార్జున్, వెంకటేష్ పాల్గొన్నారు.

బీఎస్ఎన్ఎల్ టవర్ ఏర్పాటుకు స్థల పరిశీలన

గుడిపాల: మండలంలోని పశుమంద వద్ద బీఎస్ఎన్ఎల్ టవర్ ఏర్పాటుకు స్థలాన్ని గురువారం అధికారులు పరిశీలించారు. స్థానిక సర్పంచ్ రజినీకాంత్ ఆధ్వర్యంలో బీఎస్ఎన్ఎల్ ఎస్‌డీఈ శ్రీనివాసులు, జేటీవో సిద్ధయ్య, లైన్‌మ్యాన్ గణేష్, సర్వేయర్ కిరణ్‌తో కలిసి స్థలాన్ని చూశారు. పశుమంద సమీపంలో ఇప్పటికీ ఏ ఒక్క టవర్ సిగ్నల్ రావడం లేదు. దీంతో వినియోగదారులు ఇబ్బంది పడుతున్నారు. ఈ క్రమంలో బీఎస్ఎన్ఎల్ టవర్ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. దీంతో అధికారులు పశుమంద బస్టాప్ వద్ద టవర్ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించారు.



బీఎస్ఎన్ఎల్ టవర్ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

వేణుగోపాల స్వామి ఆలయంలో గణపతి హోమం



గణపతి హోమం నిర్వహిస్తున్న అర్చకులు



పటం, కలశాలను ఊరేగింపుగా తీసుకొస్తున్న దృశ్యం

గుడిపాల: మండలంలోని 189 కొత్తపల్లెలో ఉన్న రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయ కుంభాభిషేకంలో భాగంగా గురువారం గ్రామస్తులు గణపతి హోమంతోపాటు నవగ్రహ హోమం, వాస్తు, అమృత సంగ్రహణం, వేదపారాయణం, పంచగవ్య అభిషేకం, గణపతి నవగ్రహ శివ, విష్ణు ధన్వంతరి, సుర్యన ప్రథమ కాల హోమాన్ని ఘనంగా నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. జానకిరామిరెడ్డి కుటుంబ సభ్యులు బహూకరించిన రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామి మూలస్థాన పటం, నరేష్‌రెడ్డి, నిరంజన్ అందించిన కలశాలను ఊరేగింపుగా తీసుకొచ్చారు.

వన్ టౌన్ ఎస్ఐగా మల్లికార్జున బాధ్యతల స్వీకరణ

చిత్తూరు అర్బన్: చిత్తూరు వన్ టౌన్ ఎస్ఐగా మల్లికార్జున గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన జిల్లా పోలీసు శిక్షణ కేంద్రంలో పనిచేస్తూ బదిలీపై వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. శాంతి భద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తామని, ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో వైభవంగా ధ్వజారోహణం

చంద్రగిరి: మండల పరిధిలోని తొండవాడ సమీపంలో గల స్వర్ణముఖనది ఒడ్డున వెలసిన శ్రీఅగస్త్యేశ్వర స్వామివారి ఆలయంలో ముక్కోటి ఉత్సవాలు సందర్భంగా గురువారం ధ్వజారోహణ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా తెల్లవారుజామున స్వామివారిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలను నిర్వహించారు. అనంతరం విభూది, చందనం, కుంకుమ, పలు రకాల పుష్పాలతో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యాన్ని కల్పించారు. తదుపరి గణపతి హోమం చేపట్టి పూర్ణాహుతితో ముగించారు. అనంతరం భక్తుల చేతుల మీదుగా గోపూజ నిర్వహించారు. కలశ స్థాపన, మండపారాధన నిర్వహించారు. ఆలయ ధర్మకర్త చేతుల మీదుగా ధ్వజారోహణం నిర్వహించారు. రాత్రి మాడవీధుల్లో సింహ వాహనంపై స్వామివారు ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ వంశపారంపర్య ధర్మకర్త రఘురామిరెడ్డి, మొగిలి వంశస్తులు, ప్రధాన అర్చకులు ప్రసాద్ స్వామి, హేమంత్ స్వామి, గ్రామస్తులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



ఉత్సవాలకు నాంది పలుకుతూ ధ్వజారోహణం

ఉన్నచోటే ఉన్నత వైద్యం



ఐరాలలో కంటి అద్దాలు అందజేస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు



తవణంపల్లెలో రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఐరాల/తవణంపల్లె: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో పేదలకు ఉన్నచోటే ఉన్నత వైద్యం అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు తెలిపారు. ఆయన గురువారం ఐరాల మండలంలోని 35 యర్లంపల్లె సచివాలయం ఆవరణలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని పరిశీలించారు. అదేవిధంగా తవణంపల్లె హైస్కూల్లో వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి పేద ప్రజల కోసం ఆరోగ్యశ్రీ పథకాన్ని తీసుకొచ్చారని తెలిపారు. ఆయన కుమారుడు ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి మరో రెండడుగులు ముందుకేసి ఆరోగ్యశ్రీని విస్తరించడమే కాకుండా ప్రతి ఇంటికీ డాక్టర్ వెళ్లి వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకున్నారని వివరించారు. ఈ వైద్య శిబిరంలో 327 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కంటి సమస్యలతో బాధపడుతున్న వారికి కంటి అద్దాలు అందజేశారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తాజ కూరగాయలు, వంటకాలను ఎమ్మెల్యే పరిశీలించారు. తవణంపల్లెలో 812 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి 12 మందిని మెరుగైన వైద్యం కోసం పెద్దాసుపత్రులకు రెఫర్ చేశారు. అంగన్‌వాడీ వర్కర్లకు బరువు తూచే మెషిన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఐరాల మండలానికి చెందిన డాక్టర్లు పూర్ణలత, రాజశేఖర్, రామ్‌ప్రకాష్, సర్పంచ్ మల్లీశ్వరి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చంద్రశేఖర్‌రెడ్డి, కాణిపాకం ఆలయ చైర్మన్ మోహన్‌రెడ్డి, ఎంపీడీఓ నాగరాజు తదితరులు పాల్గొన్నారు. అలాగే తవణంపల్లెలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ గీతారెడ్డి, జెడ్పీటీసీ భారతి, వైస్ ఎంపీపీ పట్నం ప్రతాప్‌రెడ్డి, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు సి.హరిరెడ్డి, వైద్యాధికారులు ప్రియాంక, దాత్రేయచౌదరి, మోహన్‌వేలు, వినయ్‌కుమార్, హేమ, అవీద్, యశ్వంత్, ఎన్‌రీచ్, ఎంపీడీవో అబ్దుల్‌కలాం ఆజాద్, తహసీల్దార్ గుణశేఖర్ రెడ్డి, ఐసీడీఎస్ సీడీపీవో నిర్మల పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో పేదలకు కార్పొరేట్ వైద్యం

గుడిపాల: జగనన్న ఆరోగ్య సురక్షతో గ్రామీణులకు కార్పొరేట్ తరహా వైద్యం అందిస్తున్నట్టు డాక్టర్లు హరి, అనూష తెలిపారు. కుప్పిగానిపల్లె సచివాలయం పరిధిలో గురువారం సర్పంచ్ మధుసూదన్‌రాయల్ అధ్యక్షతన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 434 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ వర్కర్లు ఏర్పాటుచేసిన పోషకాహార స్టాల్‌ను సర్పంచ్ పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌వో భానుప్రకాష్, వైఎస్సార్‌సీపీ నాయకులు శేఖర్, క్రిష్ణమూర్తి, వెంకటరమణ, రఘు, వడివేలు, శంకర్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



గుడిపాల: కంటి అద్దాలు పంపిణీ చేస్తున్న సర్పంచ్



బంగారుపాళెం: వృద్ధులకు కంటి అద్దాలు అందజేస్తున్న సర్పంచ్ శ్రీహరి, ఇన్‌చార్జి ఎంపీడీవో హరిప్రసాద్‌రెడ్డి

పేదల ఆరోగ్యానికి భరోసా

బంగారుపాళెం: జగనన్న ఆరోగ్య సురక్షతో పేదల ఆరోగ్యానికి భరోసా కల్పిస్తున్నట్టు ఇన్‌చార్జి ఎంపీడీవో హరిప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఆయన గురువారం సర్పంచ్ శ్రీహరితో కలిసి ఎగువరాగిమానుపెంటలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. వైద్య శిబిరంలో 375 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. వృద్ధులకు కంటి అద్దాలు అందజేశారు.